# ఆగమాగం ఓటేస్తే రైతు బతుకు ఆగమే!



### ❖ మళ్లా మోసం జెయ్యాలని జూత్తున్రు..



భైంసా టౌన్, నవంబర్ 24 : తెలంగాణ వచ్చినంక సీఎం కేసీఆర్ సాగుకు 24 గంటల ఉచిత కరెంటు ఇస్తుండడంతో సాగు రూపు మారిపోయింది. రైతును రాజు చేసింది కరెంటే. 50 ఏండ్లు పాలించిన కాంగ్రెస్ అప్పుడు ఏం జెయ్యలే. ఇప్పుడు ఎలక్షన్లచ్చినయని కొత్తగా సాగుకు 3 గంటల కరెంట్ ఇచ్చి, 10 హెచ్‌పీ మోటర్లు పెడ్తమంటున్రు. కాంగ్రెస్ నాయకులకు రైతులపై ఎప్పుడూ చిన్న చూపే. రైతు బాగు పడడం వాళ్లకు ఏ మాత్రం ఇష్టం లేదు. కాంగ్రెసోళ్ల మాటలింటే రైతులు ఆగమైతరు. రైతుల మీద మళ్లా కుట్రలు చేసే ప్రయత్నం చేస్తున్నరు. గిది తెల్వకుండా కాంగ్రెస్ నాయకులు మాట్లాడడం సిగ్గుచేటు. రైతులు ఆలోచన జెయ్యాలె. రైతులను మోసం చేసే కాంగ్రెస్‌ను ఓడించుడే. తగిన బుద్ధిజెప్పాలె.

**- రాజన్న, పాంగ్రి**

### ❖ కాంగ్రెస్‌ను బొందపెట్టాలె..



తానూర్, నవంబర్ 24 : సీఎం కేసీఆర్ ఎవుసానికి కరెంటు సమృద్ధిగాఇస్తున్నారు. కాంగ్రెస్ నాయకులు చెప్పినట్టు మూడు గంటల కరెంటు ఎటూ సరిపోదు. కాంగ్రెస్ పాలన వస్తే అంధకారం తప్పదు. గతంలో కాంగ్రెస్ పాలనలో రైతులు పడ్డ అవస్థలు ఎవరూ మరువలేదు. అప్పట్లో ఎన్నోసార్లు కరెంటు కోసం సబ్‌స్టేషన్లను ముట్టడించారు. వచ్చీ రాని కరెంటుతో మోటర్లు కాలిపోయేవి. రిపేర్ చేయించడంవల్ల రైతులపై ఆర్థికభారం పడేది. నీరు అందక పంటలు ఎండిపోయేవి. రైతులు తీవ్రంగా నష్టపోయారు. కాంగ్రెస్ నాయకుల మాటలను నమొద్దు. వ్యవసాయానికి 24 గంటల కరెంటుతో ఎంతో మేలు కలుగుతున్నది. పంటలకు నీరు పెట్టేందుకు ఏ సమయంలోనైనా రైతులు మోటర్లు పెట్టుకుంటున్నారు. రైతులు ఆలోచించి రైతు ప్రభుత్వానికి అండగా నిలవాలి. కరెంటు మూడు గంటలు ఇస్తమన్న కాంగ్రెస్ పార్టీని బొందపెట్టాలి.

**- మౌలాఖాన్, మైనార్టీ నాయకుడు బెల్‌తరోడ**

# ఎద్దెర్కనా.. ఎవుసం ఎర్కనా..

## కాంగ్రెసోళ్లకు వ్యవసాయం గురించి అసలు తెల్వా..

- వారి హయాంలో కరెంట్ కోసం అష్టకష్టాలు పడ్డం..
- ఇప్పడు 3 గంటల కరెంటు.., 10 హెచ్‌పీ మోటర అంటే ఎట్లా..
- ఆ నాయకులను నమ్మేది లేదు.. ఓట్లు వేసేది లేదు..
- స్పష్టం చేసిన రైతులు

**మూడు గంటల కరెంటుతో మూడు మళ్లు గూడ పారయ్. కాంగ్రెస్ అధికారంల ఉన్నప్పడు కరెంటు ఎప్పడు వస్తుండెనో? ఎప్పడు పోతుండెనో? తెల్వకపోయేది. లోవోల్టేజీతో మోటర కాలిపోయేది. ఇగ ట్రాన్స్‌ఫార్మర్ కాలితే ఎన్ని కష్టాలో. ఒక్కొక్కసారి పంటలు ఎండిపోయేవి. ఎవుసం బావులకు 10 హెచ్‌పీ మోటర్లు వాడితే బాయిల నీరు తొందరగ ఖాళీ అయితది. మోటర్ మీద వజను పడి కాలిపోతది. దానికి ఎంత ఖర్చు అయితదో దేవుడికి ఎరుక. రేవంత్‌రెడ్డి, ఆ పార్టీ నాయకులకు ఎద్దర్కెనా.. ఎవుసం ఎర్కనా.. ఎవుసం అంటే అస్సలు తెల్వదు. కాంగ్రెసోళ్ల హయాంల పడ్డ కష్టాలు వీళ్లు మాట్లాడుతుటే మళ్లా గుర్తుకస్తున్నయ్. ఇగ రానియ్యం కాంగ్రెస్‌ను. గెలువనియ్యం కాంగ్రెస్‌ను.**

### ❖ పంటలెండుడు ఖాయం..



ముథోల్, నవంబర్ 24 : నిరంతర కరెంట్‌తో నీళ్లు పుష్కలంగా ఉన్నాయి. పంటలకు కావాల్సినంత నీరు అందుబాటులో ఉంది. మోటర్లు కాలడం, రిపేర్లు తగ్గిపోయాయి. మూడు గంటల కరెంటుతో పంటలు ఎండిపోవుడు ఖాయం. ఇప్పుడిప్పుడే రైతు పంటలు సాగుచేసుకుంటూ ముందటికి పోతున్నడు. కాంగ్రెస్ మూడు గంటల కరెంటు అనడంతో భయమేసుతన్నది. మళ్లా అప్పు తీసుకవచ్చి అన్నం తిని బతకాల్సి వస్తుంది. మళ్లా పాత పాలన వస్తే మాకు చీకటి రోజులే ఖాయం. **- రవి, చించాల**

### ❖ మళ్లీ పాత రోజులు తెత్తరు..



భైంసా, నవంబర్ 24 : తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే మళ్లీ పాత రోజులే వస్తయ్. రైతులంటే వాళ్లకు పట్టదు. రాజకీయం కోసం రైతుల బతుకులతోటి ఆడుకుంటరు. 10 హెచ్‌పీ మోటర్‌తోటి గంటలో ఎకరం నీరు పారించవచ్చని రేవంత్ రెడ్డి చెప్పడం కరెక్టు కాదు. కేసీఆర్ వచ్చాక 24 గంటల కరెంటు అందుతున్నది. దీంతోటి రైతులు ఎప్పుడు పొలానికి పోయినా మోటర్ వేసుకొని సాగు పనులు చేసుకుంటున్నరు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రైతుల పరిస్థితి ఎలా ఉంటుందోనని భయం పట్టుకుంది. మళ్లా బీఆర్‌ఎస్ ప్రభుత్వం వస్తే రైతులకు మేలు జరుగుతుంది. **- లక్ష్మణ్, రైతు**

### ❖ పంటలకు ఇప్పడు ఇబ్బంది లేదు



భైంసా, నవంబర్ 24 : తెలంగాణ ప్రభుత్వం 24 గంటలు కరెంటు ఇచ్చుడుతోటే పంటలు మంచిగా పండుతున్నయ్. ఏ మేరకు నీరు అవసరమో ఆ మేరకు పంటలు సాగు చేసి, మంచి దిగుబడులు సాధిస్తున్నాం. కరెంటు లేకపోతే ఎవుసం బంద్ చేసుకునుడే. ఇప్పుడు కాంగ్రెస్ నాయకులు మాట్లాడే మాటలు గట్లనే ఉన్నయ్. మూడు గంటల కరెంటు ఇస్తే సరిపోతుందని మాట్లాడుతున్రు. గట్లైతే మళ్లాల పాతరోజులత్తయ్. కరెంటు జోలికి వస్తే ఊరుకునేదే లేదు. మాకు మంచి పరిపాలన సాగుతున్నది. మూడోసారి ముఖ్యమంత్రి కేసీఆర్ ఖాయం. **- సాయిలు, రైతులు**

### ❖ కరెంటు ఎప్పడచ్చేదో.. ఎప్పడు పోయేదో..



ముథోల్, నవంబర్ 24 : కాంగ్రెస్ పాలనలో రాత్రుళ్లు పొలాలకు పోవాలంటే భయమేసేది. చాలాచోట్ల రైతులు చనిపోయారు. కరెంటు ఎప్పుడొస్తుందో.. ఎప్పుడు పోతుందో తెల్వక చాలా ఇబ్బందిపడ్డం. సీఎం కేసీఆర్ సారు వల్ల ఆ బాధ లేకుంటైంది. ఇప్పుడు ధైర్యంగా వ్యవసాయం చేసుకుంటున్నాం. ఉచిత కరెంటుతో అన్నదాతల ఇంట్లో సుఖ శాంతులు ఉన్నాయి. వేలకు వేలు బిల్లులు వచ్చే బాధతప్పింది. తెలంగాణ అని చెప్పుకోవడానికి సంతోషిస్తున్నాం. కానీ, ఇప్పుడు కాంగ్రెసోళుల మూడు గంటల కరెంటుచాలు అంటున్నరు. అంటే మళ్లా ఆ బాధలు తెస్తరనేగా. **- జలన్న, ముథోల్**

### ❖ కాంగ్రెస్‌ను దగ్గరికి తియ్యరు..



కుభీర్, నవంబర్ 24 : కాంగ్రెస్ అధికారంలో ఉన్నన్ని రోజులు రైతులు పడ్డకష్టాలు గుర్తున్నయ్. లోవోల్టేజీ, మోటర్లు కాలిపోవుడు. ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోవుడు, రిపేర్ కోసం రోజులు గడ్సిపోవుడు దానివల్ల రైతులు సాగు చేసిన పంటలు ఎండిపోవుడు. పంటలు చేతికచ్చినంక మద్దతు ధర లేకపోవడం. దీంతో ఎందరో రైతులు ఆత్మహత్యలు చేసుకున్నరు. కేసీఆర్ వచ్చినంక రైతులు, రైతు కుటుంబాలు బాగు పడ్డయ్. పంటలకు మంచి ధరలతో ప్రభుత్వమే కొంటున్నది. అందుకే కేసీఆర్ సారు మళ్లీ రావాలి. కాంగ్రెస్‌ను ఏ రైతూ దగ్గరికి తియ్యడు. రేవంత్‌రెడ్డి మూడు గంటలే కరెంటు సరిపోతుందని అనడం కరెక్టు కాదు. వచ్చేది కాంగ్రెస్ కాదు కేసీఆర్ సారే. **- పెద్దరాములోల్ల లస్మన్న, రంజిని, రైతు**

### ❖ దొంగ కాంగ్రెస్‌ను నమ్మద్దు..



కుభీర్, నవంబర్ 21 : తెలంగాణ సర్కారు ఎవుసానికి 24 గంటలు ఉచిత విద్యుత్ ఇవ్వడంతో ఈ తొమ్మిదేండ్లలో రైతులు గణనీయంగా ఎదిగారు. రెండు మూడు పంటలు సాగుచేసి, అధిక దిగుబడులు సాధిస్తున్నారు. ఇది కేసీఆర్ పుణ్యమే. ఎన్నో ఏండుల అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవసాయానికి 24 గంటల ఉచిత కరెంటు ఇవ్వకపోగా నేడు ఆ పార్టీ అధినేత రేవంత్‌రెడ్డి మూడు గంటల కరెంటు సరిపోతుందంటున్నడు. బోర్లకు 10 హెచ్‌పీ మోటర్లు అమర్చాలని చెప్పడం శోచనీయం. అదే జరిగితే మళ్లా పాతరోజులే అత్తయ్. రైతుల ఆత్మహత్యలు మొదలైతయ్. దొంగ కాంగ్రెస్‌ను నమ్మద్దు..

**- భీమన్న, రైతు, కుభీర్**

### ❖ రైతులు ఉప్పెనలా మీదపడ్తరు..



కుభీర్, నవంబర్ 24 : తెలంగాణలో కేసీఆర్ ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి రావడం ఖాయం. రేవంత్‌రెడ్డి మూడు గంటల కరెంటు సరిపోతుందని గుట్టు చప్పుడు కాకుండా మాట్లాడడం కాదు. నీవు ఎన్నికల ప్రచార సభల్లో ఆ మాట ప్రకటించి చూడు నీ మీద ఉప్పెనలా రైతులచ్చి పడుతరు. రైతులను మోసం చేయడానికేనా ఇంకెవరూ దొరకరా మీకు. 24 గంటల కరెంటు ఇచ్చే తెలంగాణలోని కేసీఆర్ సర్కారుకే ప్రజలు మళ్లీ పట్టం కడ్తరు. ఇది సత్యం. రైతుల కోసం ఇన్ని చేస్తున్న సీఎం కేసీఆర్‌ను ప్రజలు దూరం చేసుకోరు. **- మైస గంగాధర్, రైతు, సాంగ్వి, కుభీర్**